"ఇంటిపేరా !"

"ఔను మేడమ్. నేను ఆంధ్రుణ్ణి. ఆంధ్రులకు ఇంటిపేర్లుంటాయి కదండి. మా యింటిపేరు వసుంధరవారు. నా పేరు విశ్వేశం"

ఆసమయానికి స్టెల్లా కాగితాలు పుచ్చుకుని అక్కడికొచ్చింది. ప్రిన్సిపాలు ఆమెకేసిచూస్తూ, "నువ్వు టెలిగ్రాం పంపిన వసుంధరా విశ్వాసం ఈయనే !" అంది.

ఆ వచ్చినాతడు వెంటనే, "వసుంధరా విశ్వాసం కాదు మేడమ్, వసుంధర విశ్వేసం. విశ్వేసం అంటే విశ్వానికి ఈశం అన్నమాట. (లార్డు ఆఫ్ ది యూనివర్స్) అని అర్థంవచ్చే పేరది" అన్నాడు.

స్టెల్లా కేమనాలో తోచిందికాదు తప్పంతా తనదేనని చెప్పి, ప్రిన్సిపాలు తనమీద విరుచుకుపడుతుంది. ఆపని జరక్కపూర్వమే తప్పు కాస్తా ఆ వచ్చిన వాడిమీద తోసేసి బయటపడాలి. "ఏమండీ విశ్వాసం గారూ !"

"విశ్వాసంకాదు మేడమ్ విశ్వేసం"

"సరే, డేమిట్ మీ పేరేదైతేనేం ? మమ్మల్ని మీరు మోస గిస్తే ? మీ యింటిపేరుతో"

"మోసమా మేడమ్ ? మోసమేముందిందులో ?"

"ఆడవాళ్ల కాలేజీలో ఉద్యోగమని తెలుసుండి అసలు మీరెందుకు దరఖాస్తు చెయ్యాలి ?"

"కొత్త కాంస్టిట్యూషను ప్రకారం మీ కాలేజీకూడా జాతి మత లింగభేదాలు పాటించటం లేదేమో అనుకున్నాను మేడమ్. ఏమంటే మీ ఎడ్వర్టైజుమెంటులో "పురుషులు దరఖాస్తు చెయ్యకూడదు" అని లేదు.

స్టెల్లాదృష్టి ప్రిన్సిపాలు ముఖంమీద అప్రయత్నంగా పడింది 'ఇతడు చెప్పినది సబబుగానే ఉంది. అడ్వర్టయిజుమెంటులో ఆ విషయం సూచించకపోవటం నీదే తప్పు' అన్నభావం ప్రిన్సిపాలు మొఖంలో స్టెల్లాకి తెల్లమైంది. ఐతేం ? ఓ పట్టాన్ని ఓటమి ఒప్పుకునేదికాదు స్టెల్లా. విశ్వేశంతో, "మీ యింటిపేరు మాకు మిమ్మల్నిగురించి వేరే అభిప్రాయం కలి

